


బాలల
మార్చి 2017
చంద్రప్రభ
మాసపత్రిక
రూ. 20/-
శ్రీమతి రావినూతల సువర్ణాకన్నన్‌గారి
అద్భుత సీరియల్ స్వర్ణసింహాసనం



# మంచి పేరు

– ప్రతాప వెంకట సుబ్బరాయుడు, సికింద్రాబాద్

రామయ్య, రాఘవయ్య గుమ్మడి కాయల వ్యాపారస్తులు. రామయ్య తన గుమ్మడి కాయలను ఒకటి కొంటే ఒకటి ఉచితం అని అమ్మసాగాడు.

అది చూసిన రాఘవయ్యకూడా తన వ్యాపారాన్ని పెంచుకోడానికి ఒక గుమ్మడి కాయ కొంటే మరొకటి ఉచితం అని అమ్మసాగాడు. అయినా రామయ్య వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వుంటే రాఘవయ్య వ్యాపారం దివాళావైపుగా సాగింది. దానికి కారణం తెలియక 'రామయ్య, నువ్వు నేను ఒకేలా వ్యాపారం చేస్తున్నా నీకేమో లాభాలు వస్తున్నాయి. నాకేమో నష్టాలు వస్తున్నాయి. నీకు లాభం వస్తునందుకు నేనేమి బాధపడడంలేదు కాని నావ్యాపారం బాగు పడాలన్నది నా తాపత్రయం. పిల్లలు గలవాణ్ణి నువ్వు గట్టెక్కించాలి'. అన్నాడు చేతులు పట్టుకుని ప్రాధేయపడుతూ రాఘవయ్య.

'అయ్యయ్యో దాంట్లో మాయా మర్మం ఏమీ లేదు. కిటుకు అంతకన్నా లేదు. నేను ఒక గుమ్మడి కాయతో పాటు ఉచితంగా ఇచ్చే మరో గుమ్మడి కాయ కూడా నాణ్యమైనది ఇస్తున్నాను. కాని నువ్వు ఉచితంగా ఇచ్చేది చిన్న కాయ గాని లేదా కొద్దిగా పాడయిన, పుచ్చిన కాయను ఇస్తున్నావు. అది తప్పు. వ్యాపారం అనేది

తాత్కాలికమైనది కాదు. నిజాయితీ నమ్మకాలకు సంబంధించినది. ఒక్కసారి కొనుగోలు దారుడి దృష్టిలో నమ్మకం పోగొట్టుకున్నామంటే వ్యాపారం కుదేలయిపోతుంది. అందుకే నాకు వేలం పాటలో ఒక్కోసారి పుచ్చిన కాయలు వస్తే వాటిని అమ్మకానికి పెట్టకుండా బయట పారేస్తాను. ఎందుకంటే వాటి నష్టం కన్నా, అవి అమ్మితే వచ్చే నష్టం ఎక్కువ భాధ్యతతో కూడిన వ్యాపారం చేసే వ్యాపారిని కొనుగోలు దారుడు సొంత కుటుంబ సభ్యుడిలా చూసుకుంటాడు. అది ఉభయులకి శ్రేయోదాయకం'. అన్నాడు రామయ్య.

'అర్థమయింది రామయ్య, డబ్బుకి కక్కుర్తి పడి వ్యాపార విలువలకి తిలోదకాలు ఇచ్చాను. ఇకనుంచి విలువలతో కూడిని వ్యాపారం చేసి నీలా మంచి పేరు తెచ్చుకుంటాను. నువ్వు చేసిన మాట సహాయానికి కృతజ్ఞతలు రామయ్య' అన్నాడు రాఘవయ్య మనస్ఫూర్తిగా.

## ప్రపంచంలోనే అతిపెద్ద కంప్యూటర్ నమూనా

ప్రపంచంలోనే అత్యంత భారీ క్వాంటమ్ కంప్యూటర్ నిర్మాణానికి శాస్త్రవేత్తలు తయారుచేసిన నమూనా ఇది. ఫుట్‌బాల్ మైదానం సైజున్న ఈ నమూనా వాస్తవ రూపం దాల్చితే శాస్త్రసాంకేతిక రంగాలతో పాటు పారిశ్రామిక, వైద్య, వాణిజ్య రంగాల్లో విప్లవాత్మకమార్పులకు దారితీస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. విశ్వ రహస్యాలను, అంతరిక్షంలో అంతుచిక్కని చిక్కుముడులను కూడా ఇట్టే విప్పేస్తుందన్నారు. కంప్యూటర్ల మధ్య అనుసంధానికి వాడే ఫైబర్ ఆప్టిక్ కేబుల్ల స్థానంలో అయస్కాంత క్షేత్రాలను ఉపయో గిస్తే కంప్యూటర్ వేగం లక్ష రెట్లు పెరుగుతుందట! ప్రాక్టికల్‌గా సాధ్యమయ్యే నమూనా ఇదేనని దీని రూపకర్తల బృందానికి నేతృత్వం వహిస్తున్న ప్రొఫెసర్ విన్‌ఫ్రెడ్ హెన్సింగర్ తెలిపారు.

